క్లుప్తంగా

నడిగూడెంకు త్వరలో 108 వాహనం మంజూరు

నడిగూడెం : నడిగూడెం వైద్య విధాన పరిషత్ వైద్యశాలకు త్వరలో 108 వాహనం మంజూరు కానున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు, ఎస్‌ఆర్‌ఐ జలగం సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నడిగూడెం మండలానికి అత్యవసరంలో మునగాల, కోదాడ నుంచి 108 వాహనాలు సకాలంలో రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో హరీష్‌రావు స్పందించి 108 వాహనం మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సుధీర్ తెలిపారు.

'మన ఊరు- మన బడి' పనుల పరిశీలన



సిరిపురంలో తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరి- మన బడి పథకం కింద రూ.12 లక్షల వ్యయంతో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను బుధవారం ఎంఈఓ ఎండీ.సలీం షరీఫ్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించి 16 రోజులైన సందర్భంగా మంగళవారం రాత్రి భక్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలకు హెల్త్ కార్డులు పంపిణీ



హెల్త్ కార్డులు అందజేస్తున్న డీఎల్‌డీఏ డైరెక్టర్ నర్సయ్య

చిలుకూరు : చిలుకూరు పశువైద్యశాలలో గోపాలమిత్రలకు బుధవారం రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ నుంచి మంజూరైన హెల్త్ కార్డులను పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, ఈఓ పాశం శ్రీనివాస్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాలమిత్రలు ఉద్యోగ నిర్వహణలో గాయాల పాలైనప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా హెల్త్‌కార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సైదులు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయం అభివృద్ధికి రూ. 2 లక్షల జెడ్పీ నిధులు



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా

చిలుకూరు : చిలుకూరులోని బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న బాపూజీ శాఖా గ్రంథాలయానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా రూ.2 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రంథాలయం ఆవరణలో ప్రొసీడింగ్‌ను గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబాల వెంకటికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, గ్రామ పెద్దలు, గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు పిల్లుట్ల కృష్ణయ్య, నాగయ్య, వెంకటయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

సూర్యాపేట క్రైం : పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్‌పై బోటింగ్ సిబ్బందితో పలు వురు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన సంతోష్, సందీప్, నాగు, శ్రీకాంత్ మినీ బోటింగ్ సిబ్బందిపై చేయి చేసుకోవడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ సిబ్బంది పిడమర్తి ప్రసాద్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

కాల్వల మరమ్మతులపై పట్టింపేదీ..!

- అధ్వానంగా ఎల్-2, ఎల్-3 కాల్వలు
- కట్టలు కుంగి వృథా అవుతున్న నీరు
- చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు



అధ్వానంగా ఎల్- 2 మైనర్ కాలువ



ఎల్-3 మైనర్ కాలువ ఇలా..

చిలుకూరు : మండలంలోని సాగర్ కాలువలు అధ్వానంగా మారాయి. కాలువలు మట్టితో పూడాయి. కొన్నిచోట్ల కాలువల్లో కంప చెట్లు పెరిగాయి. ప్రధానంగా మండలంలో ముక్త్యాల మేజర్ కాలువకు అనుసంధానంగా ఉన్న మైనర్ కాల్వలైన ఎల్- 2, ఎల్- 3 కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువ కట్టలు కుంగి పోయి, ఇరువైపులా సిమెంట్ కట్టడాలు కోతకు గురయ్యాయి. దీంతో కాలువ నీళ్లు అధికంగా వచ్చినప్పుడు కాలువ ఎప్పుడు తెగుతుందోనని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు కాలువ కట్టలు తెగి పంట పొలాలు దెబ్బతిన్నాయని చెబుతున్నారు. కాగా ఈ కాలువల పరిధిలో చిలుకూరు, సీతారాంపురం గ్రామాలలో 600 ఎకరాల ఆయకట్టు ఉన్నది.

అధికారుల కాలయాపనతో..

కాగా ఖరీఫ్ సీజన్ వచ్చినా నేటికీ కాలువలకు మరమ్మతులు చేపట్టడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువలను బాగు చేయాలని అధికారులకు అనేకసార్లు విన్నవించినా వారు కాలయాపన చేస్తున్నారని అంటున్నారు. దీంతో నీళ్లు వచ్చేటప్పుడు కాలువకు లీకులు అయి నీరు వృథా కావడం పరిపాటిగా మారిందని చెబుతున్నారు. అంతేకాకుండా నీళ్లు వదిలిన తరువాత కాలువలు పటిష్టంగా లేవని నీళ్లు తక్కువ వదులుతున్నారని దీంతో చివరి భూములను నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కాలువలకు మరమ్మతులు చేయించి చివరి భూములను నీళ్లు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్‌ఎస్పీ జేఈ మానసను వివరణ కోరగా మండలంలోని కాలువ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరమ్మతులకు నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలో అధ్వానంగా మారిన ఎల్- 2, ఎల్- 3 కాలువలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. కాలువలు బలహీనంగా ఉండటంతో నీళ్లు వచ్చిన సమయంలో కట్టలు కోతకు గురై నీరు వృథాగా పోతోంది. పొలాలు దెబ్బతింటున్నాయి. చివరి భూములకు నీరు అందడం లేదు.

– మేకపోతుల శ్రీను, రైతు, చిలుకూరు

ఆదర్శ నాయకుడు.. పీవీ నరసింహారావు



హుజూర్‌నగర్‌లో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపిన నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ యరగాని నాగన్న, ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ సాముల శివారెడ్డి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్‌లో బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు, ఆదర్శనీయ నాయకుడు పీవీ నరసింహారావు అన్నారు. భూసంస్కరణలకు ఆదర్శంగా నిలుస్తూ తనభూమిని పేదలకు పంచిన నాయకుడు పీవీ నరసింహారావు అని వారు కొనియాడారు. దేశంలో మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడిపి తన రాజకీయ చతురతను చాటుకున్నారని చెప్పారు. రాజకీయాలకతీతంగా అందరికీ ఆయన ఆదర్శనీయుడని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాచిమంచి గిరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కస్తాల శ్రావణ్, నాయకులు జక్కుల మల్లయ్య, ఎం.సత్యనారాయణ, ఎస్.సుబ్బారాజు, కె.మట్టయ్య, బి.గురవయ్య, సీహెచ్.రాము, బి.సైదులు, బెంజిమెన్, సైదులు, రామ్మూర్తి, రాము, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో బోర్లు, బావుల ఆధారంగా సాగుచేసే రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ట్రాన్స్‌కో అధికారులు నిరంతరం విద్యుత్ అందించాలన్నారు. ఈనెల 30 నుంచి మండలంలోని పోడు భూముల రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఇవ్వనున్న పట్టాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించగా ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, తహసీల్దార్ సాయాగౌడ్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంఈఓ చత్రునాయక్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయంలో విశేష పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీస్వామివారికి కృష్ణానది నుంచి మంగళ వాయిద్యాలతో బిందెతీర్థం తెచ్చి పంచామృతాలతో పంచసూక్త విధానంగా గర్భాలయంలో గల మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించారు. నిత్యకల్యాణాన్ని ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదంతో ప్రారంభించి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభందనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

పాఠశాలకు సామగ్రి బహూకరణ



దాతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చిలుకూరు : చిలుకూరు గ్రామంలోని సాయి గ్రామర్ పాఠశాలకు కొత్రపిడత మట్టయ్య- పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్ బుధవారం రూ.10 వేలు విలువ గల టేబుల్, కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ గవిని ఆంజనేయులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప్తి, ఉమ, నిర్మల, లావణ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తా



దోరకుంటలో గీత కార్మికులకు లైసెన్స్‌లు అందజేస్తున్న కేఎల్‌ఎన్ ప్రసాద్

కోదాడరూరల్ : అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తానని కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని దోరకుంటలో గీత కార్మికులకు మంజూరైన లైసెన్స్‌లను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. గీత కార్మికులు లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని, గడువు ముగిసిన వారు రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొమ్మగాని వెంకటేశ్వర్లు, గుర్రం కృష్ణ, పాపయ్య, రమేష్, ఉపేందర్, శ్రీనివాస్, పృథ్వీ, సూర్యనారాయణ, లక్ష్మయ్య, పూర్ణచందర్‌రావు, రాములు, శైలజ ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మునగాలలో ఎంపీడీఓకు సమ్మె నోటీస్ ఇస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఎస్.భూపాల్ రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా స్వరాజ్యం మాట్లాడుతూ , మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని కోరారు. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం సిబ్బందికి రూ.19,500లు వేతనం చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, నాయకులు రాములమ్మ, మౌనిక, మామిడి వెంకన్న, శ్రీను, రఘు, బజారు, ముత్తయ్య, వీరబాబు, సైదులు, నాగరాజు, సీతారాములు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

చిలుకూరు : గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో సమ్మె చేయనున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ పాండు యాదవ్‌కు కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మాట్లాడుతూ పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లకు జీతాలు ఇవ్వాలని కోరారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు వజ్రాణపు తిరపయ్య, పట్టపాక నాగేశ్వరరావు, బత్తిని నాగేంద్రబాబు, కట్టెకోల శ్రీను, కిరణ్, కృష్ణయ్య, కాశయ్య, ఉపేందర్, గోపయ్య, నాగరాజు, కొండలు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కోదాడరూరల్ : గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సిబ్బంది, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని, వేతనాలను పెంచాలని, కనీస వేతనాన్ని రూ.19500 గా నిర్ణయించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు లింగయ్య, రామారావు, సైదా, శ్రీను, శంకర్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య



హుజూర్‌నగర్ : విద్యార్థులకు నోటు బుక్స్ అందజేస్తున్న వెంకటేశ్వర్లు



కోదాడఅర్బన్ : విద్యార్థికి నోట్ పుస్తకాలు అందజేస్తున్న స్వర్ణభారతి ట్రస్ట్ సభ్యులు

నేరేడుచర్ల : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సదుపాయలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, శంకర్, వెంకటకృష్ణ, శబినా తదితరులున్నారు.

విద్యార్థికి నోట్ బుక్స్ అందజేత

నేరేడుచర్ల మున్సిపాలిటీలో గత ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తండ్రి, తమ్ముడిని కోల్పోయి తీవ్ర గాయాలతో కొలుకున్న పిల్లలమర్రి కావేరికి మున్సిపాలిటీకి చెందిన దాత కోటగిరి వేణు రూ.2500 విలువ గల నోట్ బుక్స్‌ను బుధవారం అందజేశారు. కళ్యాణి, కొణతం నాగిరెడ్డి, యడవల్లి సైదిరెడ్డి తదితరులున్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీతారాంపురంలో గల ప్రాథమికోన్నత పాఠశాల -2లోని విద్యార్థులకు బుధవారం వాసవీ క్లబ్ లెజెండ్ వారి ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వంగవీటి గురుమూర్తి 500 లీటర్ల తాగునీటి ట్యాంక్ అందజేశారు. అదే విధంగా విద్యార్థులకు పట్టణానికి చెందిన కన్నెగొండ్ల వెంకటేశ్వర్లు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల లెజెండ్ ప్రెసిడెంట్ కాసం సుభాషిని, ఓరుగంటి లక్ష్మి, మానస, సోమిశెట్టి స్రవంతి, తమ్మన సుజాత, మాశెట్టి చిరంజీవి, ప్రవీణ్, ఉప్పల రాంనరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పేద విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐల చేయూత

కోదాడఅర్బన్ : ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐలు చేయూతనివ్వడం అభినందనీయమని, ఎన్‌ఆర్‌ఐల సహకారంతో పేద విద్యార్థులకు స్వర్ణభారతి ట్రస్ట్ సహకారం అందిస్తుందని ఆ ట్రస్ట్ అధ్యక్షుడు గాధంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణానికి చెందిన వెంపటి ప్రసాద్ కుమారుడు వెంపటి సాయి నితీష్, కూతురు శ్రీలౌక్యల ఆర్థిక సహాయంతో పట్టణంలోని భారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి లోహిత్‌కు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందజేశారు. ఎం.శ్రీధర్‌రావు, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, యాదా సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు.. నలుగురి అరెస్ట్

హుజూర్‌నగర్: ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జరిపిన వాహనాల తనఖీల్లో నలుగురు పట్టుబడగా మరో ఇద్దరు పారిపోయారు. నిందితుల వద్ద నాలుగు బైక్‌లు, 26 లీటర్ల సారా, 50 కేజీల బెల్లం, 5 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ నాగార్జునరెడ్డి వివరాలు వెల్లడించారు. గరిడేపల్లి మండలం తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన గండి విజయ సారా తయారీకి ఉపయోగించే 30 కేజీల బెల్లంతో హుజూర్‌నగర్‌లో పట్టుబడింది. ఆమెకు బెల్లం అమ్మిన పట్టణానికి చెందిన నర్సింహారావులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మఠంపల్లి మండలంలో నిర్వహించిన వాహనాల తనఖీల్లో సుల్తాన్ పూర్‌తండాకు చెందిన మాళోతు శ్రీకాంత్ సారాతో పట్టుబడ్డాడు. అతనికి సారా తయారీకి బెల్లం పటికను సరఫరా చేసే సామ్లాతండాకు చెందిన భూక్యా శోభన్ పారిపోయాడు. మఠంపల్లి వైపు సారాతో వస్తున్న బిల్యానాయక్ తండాకు చెందిన బాణోతు నాగులును అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా చింతలపాలెం మండలం దొండపాడు వద్ద వాహన తనఖీ చేస్తుండగా ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి 20 కేజీల బెల్లం, 5 కేజీల పటిక తెస్తున్న మఠంపల్లి మండలం లాలితండాకు చెందిన బూక్యా కృష్ణ అధికారులను చూసి తన ద్విచక్ర వాహనం, బెల్లం, పటికను వదలి పారిపోయాడు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.


పారా ఒలింపిక్ క్రీడాకారుడికి చేయూత



క్రీడాకారుడు సైదులును సన్మానిస్తున్న వైఎస్ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామానికి చెందిన అమరారపు నగేష్- ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు దివ్యాంగుడైన సైదులు కజకిస్తాన్‌లోని ఆల్మటి రాష్ట్రంలో జూలై 2వ తేదీ నుంచి 9 వరకు జరగబోయే అంతర్జాతీయ పారా ఒలింపిక్ వాలీబాల్ పోటీలలో భారతదేశం తరపున ఆడనున్నారు. దీంతో బుధవారం క్రీడా పోటీలకు వెళ్తున్న సైదులును కల్మలచెరువులో వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలారమణారెడ్డి సన్మానించి, ప్రయాణ ఖర్చులకు రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎల్లారి సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పోతురాజు చంద్రయ్య, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దస్తగిరి, బచ్చలకూరి శ్రీను, కృష్ణారెడ్డి, సీతారాంరెడ్డి, సాహెబ్, వెంకన్న, శ్యాం తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు



మునగాల : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఆర్‌బీఐ ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ 2023- 24 క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మునగాల, నడిగూడెం మండలాల నుంచి 12 పాఠశాలలకు చెందిన 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలలో ప్రథమ బహుమతిని మండలంలోని కొక్కిరేణి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాసా నిఖిల్, రెడ్డిబోయిన నిఖిల్, ద్వితీయ బహుమతి కేజీబీవీ విద్యార్థులు, తృతీయ బహుమతిని స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ ఐ.జులియాన, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సీతారామరాజులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు అభినందన

అనంతగిరి : కోదాడలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొత్కూరి దివ్యశ్రీ, అంగడాల రమ్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.హరికిషన్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండవ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పాడి ఉత్పత్తిపై దృష్టి సారించాలి



నూతన చైర్మన్ నాగేశ్వరరావు

చిలుకూరు : రైతులు వ్యవసాయంతో పాటు పాడి ఉత్పత్తిపై దృష్టి సారించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన చిలుకూరు ఆనంద్ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పాడి ఉత్పత్తిపై ఆధారపడినప్పుడే ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. రైతులకు పశుసంవర్ధక శాఖ అండగా ఉంటుందన్నారు. చిలుకూరు ఆనంద్ పాల సొసైటీ జిల్లాకే ఆదర్శమన్నారు. అనంతరం సంఘం నూతన చైర్మన్‌గా నెల్లూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా కొడారు రోశయ్య, సురగాని యదగిరిని ఎన్నుకున్నారు. అనంతరం రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, పాల శీతలీకరణ మేనేజర్ అప్పారావు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణనాగయ్య, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, పశువైద్యాధికారి వీరారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మోటార్ల వైర్లు చోరీపై అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి : మండలంలో మోటార్ల వైర్ల దొంగతనాలు జరుగుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల మోటార్ల వైర్లు చోరీకి గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ దొంగతనాలపై పోలీస్ శాఖ ఇప్పటికే నిఘా పెట్టిందని తెలిపారు. రైతులు కూడా మోటార్ల వైర్లు, తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పొలాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అనంతగిరి : జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో సైబర్ నేరాలపై బుధవారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ కందికొండ శ్రీనివాస్ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లాటరీలో బహుమతులు గెలుపొందారాని చెబుతూ ఫోన్ చేసి ఓటీపీ తెలుసుకుని కేటుగాళ్లు ఖాతాలో నగదు మాయం చేస్తుంటారని, అలాంటి ఫేక్ కాల్స్ నమ్మవొద్దని సూచించారు. అంతేగాక ఫోన్‌కు లింకులు పంపించి వాటిని ఓపెన్ చేస్తే ఖాతాలో నగదు జమ అవుతుందంటూ చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి

నడిగూడెం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 3న నిర్వహించబోయే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రేఖ తిరపయ్య, కొరట్ల శ్రీనివాస్, లతీఫ్‌బాబు, బీరవల్లి సుధాకర్‌రెడ్డి, ఎస్‌కె.సైదాహుస్సేన్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాములుగౌడ్

గరిడేపల్లి : తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన తెలుగునాడు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తాళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన చెరుకు రాములుగౌడ్ ఎన్నికయ్యాడు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవనంలో ఆ పార్టీ నాయకుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. రాములుగౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, నల్ల గొండ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న రాములుగౌడ్